క్లుప్తంగా

టీకాలతో గాలికుంటు వ్యాధి నివారణ



ఎద్దుకు టీకా వేస్తున్న డాక్టర్ జగదీష్‌బాబు

కౌతాళం: టీకాలతో గాలికుంటు వ్యాధిని నివారించవచ్చని మండల పశువైద్యాధికారి జగదీష్‌బాబు తెలిపారు. మండలంలోని బాపురం గ్రామంలో బుధవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఆయన మాట్లాడుతూ వ్యాధి వల్ల పశువుల్లో మరణాలు సంభవించే అవకాశాలు ఉన్నాయని, యాజమానులు టీకాలు వేయించాలని కోరారు. పశువులలో తీవ్రమైన జ్వరం, నీరసం కొద్ది పాటి ఎండకే పశువులు నీరసించిపోవడం, ఎద్దులలో పని సామర్థ్యం తగ్గటం వంటి లక్షణాలు గాలికుంట వ్యాధిలో ఉంటాయని చెప్పారు. సిబ్బంది కోసిగయ్యనాయుడు, కిష్టప్ప, నరసింహులు పాల్గొన్నారు.

జోరుగా 'నాడు-నేడు' పనులు



నిర్మాణంలో పాఠశాల గదులు

కౌతాళం: మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో నాడు-నేడు రెండో విడతలో భాగంగా పనులు జోరుగా సాగుతున్నాయి. ఉప్పరహాల్ గ్రామ జెడ్పీ ఉన్నత పాఠశాలలో గదుల నిర్మాణానికి రూ.1.60 కోట్లు మంజూరయ్యాయి. 9 గదులతో పాటు వంట గది, ప్రహరీ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ప్రస్తుతం బేస్‌మట్టం పనులు పూర్తయ్యాయి. వంట గది నిర్మాణానికి పునాదులు వేశారు. మిగతా పనులను త్వరలోనే ప్రారంభిస్తామని ఏఈ శివశంకర్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ చూడి జెడ్పీ పాఠశాలలో కూడా 12 అదనపు గదులతో పాటు మరమ్మతులకు రూ.2 కోట్లు మంజూరయ్యాని చెప్పారు. హాల్వి ఉన్నత పాఠశాలలో 18 అదనపు గదులకు గాను రూ.2 కోట్లతో పనులు చేపట్టామని, నదిచాగి పాఠశాలలో 6 అదనపు గదులతో పాటు మరమ్మతులకు రూ.1.40 కోట్లతో పనులు జరుగుతున్నాయని వివరించారు.

పెట్రోల్ బంక్‌ల తనిఖీ



పెట్రోల్ బంక్‌ను తనిఖీ చేస్తున్న అధికారులు

కోసిగి: స్థానిక ఇండియన్, హెచ్‌పీ, ఈఎస్సార్ పెట్రోలియం బంక్‌లను బుధవారం లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ వరప్రసాద్, తహసీల్దార్ రుద్రగౌడ ఆకస్మికంగా తనిఖీ చేశారు. బంక్‌ల్లో స్టాక్, కొలతలు, క్వాలిటీ, రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పెట్రోలియం బంక్‌లను నిర్వహించాలని సూచించారు.వాహనదారులకు అనుగుణంగా సరైన సౌకర్యాలు లేక పోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.మెరుగైన సౌకర్యాలు కల్పించాలని చెప్పారు.ఆర్ఐశ్రీరాములు, వీఆర్‌ఓలు ఉన్నారు.

అక్రమంగా చేపలు పట్టడంపై ఫిర్యాదు



ఎస్ఐ వరప్రసాద్‌కు వినతి పత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

ఆస్పరి: మండలంలోని వెంగాళాయిదొడ్డి ఆయకట్టు చెరువులో అనుమతి లేకుండా కొంతమంది అక్రమంగా చేపలు పడుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని బుధవారం ఎస్ఐ వరప్రసాద్‌కు సీపీఐ నాయకులు నాగేంద్రయ్య, విరుపాక్షి, బ్రహ్మయ్య, క్రిష్ణమూర్తి, ఉరుకుందప్ప, రంగన్న, బజారి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయకట్టులో చెరువులో మైనర్ ఇరిగేషన్ శాఖ అధికారుల అనుమతి లేకుండా కొందరు దౌర్జన్యంగా చేపలు పట్టడమే గాకుండా రైతులను భయపెడుతున్నారన్నారు. వారిపై కేసు నమోదు చేయాలని ఎస్ఐను కోరారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి

ఆలూరు రూరల్: ముద్దనగేరి సమీపంలో బుధవారం రాత్రి 9 గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో బాబు (52) అనే వ్యక్తి మృతిచెందాడు. వివరాలు.. ముద్దనగేరి గ్రామానికి చెందిన బాబు కరిడిగుడ్డం నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా గ్రామ సమీపంలో బైక్ అదుపుతప్పి కింద పడడంతో తీవ్రగాయాలయ్యాయి. అక్కడున్న వారు 108కు సమాచారం అందించి ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడు బాబుకు భార్య సరోజమ్మ ముగ్గురు కుమారులు ఉన్నారు.

తియ్యనైన లాభాలు

ఇన్నేళ్లు రెక్కల కష్టాన్ని ఫ్యాక్టరీలకు అమ్మేసి నష్టాలు మూటగట్టుకున్నారు.. కష్టాల కడలిలో మునిగి తేలారు.. ఇక పాత పంథాకు స్వస్తి పలికి, ప్రతి చెమట చుక్కకు విలువ పెంచుకున్నారు.. సరికొత్త మార్గంలో లాభాలు సొంతం చేసుకుంటున్నారు. చెరకు సాగును లాభసాటిగా మార్చుకున్నారు. నష్టాల మాటకు తావు లేకుండా ఆదాయం వశం చేసుకున్నారు. కర్ణాటక సరిహద్దు మాధవరం గ్రామ చెరకు రైతుల సరికొత్త పంథా..

- సరికొత్త పంథాలో మాధవరం రైతులు
- చెరకు మిషన్లతో లాభసాటి వ్యాపారం
- ఎకరాకు రూ.1.50 లక్షల మేర మిగులు



మాధవరంలో సాగు చేసిన చెరకు తోట



బస్సుల్లో ప్రయాణికులకు విక్రయిస్తున్న గ్రామ వ్యాపారులు



చెరకు మిషన్‌తో రసాల అమ్మకాలు

మంత్రాలయం:మండల కేంద్రానికి 8 కి.మీ. దూరంలోనున్నమాధవరం గ్రామం 2009 వరదలకు ముందు గ్రామంలో అత్యధికంగా చెరకు, ఆకు తోటలు సాగు చేసేవారు. వరదలతో భూసారం కొట్టుకుపోవడంతో ఆకుతోటల పెంపకాన్ని మానేశారు. ఇప్పుడిప్పుడే చెరకు సాగుపై ఆసక్తి చూపుతున్నారు. గ్రామంలో దాదాపు 50 ఎకరాల్లో చెరకు పంట సాగు చేశారు. పంట సాగు చేసిన రైతులెవ్వరూ చక్కెర ఫ్యాక్టరీలకు చెరకు విక్రయిచండం లేదు. సొంతంగా వ్యాపారాలు చేసుకుంటూ లాభాలు గడిస్తున్నారు.

చెరకు మిషన్ల ఏర్పాటు..

గ్రామంలో చెరకు సాగు రైతులతో పాటు దాదాపు వంద కుటుంబాలు చెరకు వ్యాపారం చేసుకుంటున్నారు. ఆదోని, ఎమ్మిగనూరు, కోసిగి, మంత్రాలయం, కర్ణాటకలోని రాయచూరు, గణదాల, గిల్కసూగూరు క్యాంపు ప్రాంతాలతో పాటు గ్రామం గుండా వెళ్తున్న 167 జాతీయ రహదారి వెంట చెరకు మిషన్లు ఏర్పాటు చేసుకున్నారు. గ్రామంలో దొరికే చెరకును మిషన్లతో రసాలు తీసి వ్యాపారం చేసుకుంటున్నారు. రైతులు ఒక్కో చెరకు గెడను స్థానిక వ్యాపారులకు రూ.8 చొప్పున, ఇతర ప్రాంత వ్యాపారులకు రూ.10 ప్రకారం విక్రయిస్తున్నారు. వ్యాపారులు గ్లాస్ చెరకు రసాన్ని రూ.10కు అమ్ముకుంటున్నారు. కొందరు రైతులు సొంతంగా మిషన్లు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలకు తెర తీశారు. ఆదోని డివిజన్ వ్యాప్తంగా 100 మిషన్లు మాధవరం వాసులవే. కొందరు చెరకు గెడలను ప్రయాణికులకు సైతం విక్రయిస్తున్నారు. గ్రామంలో రహదారి పొడవునా కుప్పలుగా వేసుకుని కర్ణాటక నుంచి వచ్చే భక్తులకు అమ్ముకుంటున్నారు. గ్రామ సర్కిల్‌లో ఈ వ్యాపారం జోరుగా సాగుతోంది. వ్యాపారం లాభసాటిగా మారడంతో మెరుగైన జీవనం సాగిస్తున్నారు.

ఎకరాకు రూ.1.50 లక్షల ఆదాయం..

గతంలో చెరకు రైతులు ఫ్యాక్టరీలకు తమ దిగుబడులు అమ్ముకునే వారు. ఫ్యాక్టరీ యజమానులు నిర్ణయించిన ధరకే అమ్ముకుని నష్టపోతూ వచ్చారు. పాత పద్ధతిని విడనాడి కొత్తగా వ్యాపారులుగా స్థిరపడుతున్నారు. సొంతంగా వ్యాపారం చేసుకుంటుండటంతో ఎకరాకు రూ.1.50 లక్షల పైగా ఆదాయం వస్తుందని రైతులు పేర్కొంటున్నారు. ఎకరా చెరకు సాగుకు రూ.40 వేల మేర ఖర్చు వస్తుందని, అది పోగా పై లాభం చేతికొస్తుందని చెబుతున్నారు.

రెండెకరాల్లో చెరకు సాగు చేశా



కౌలుకు తీసుకుని రెండు ఎకరాల్లో హైదరాబాద్ రకం చెరకు పంట వేశాం. సాగు కోసం రూ.70 వేల వరకు ఖర్చు వచ్చింది. ప్రస్తుతం పంట చేతికి రావడంతో సొంతంగా చెరకు గెడలు విక్రయిస్తున్నాం. ఒక్క చెరుకు గెడను రూ.20 ప్రకారం అమ్ముతాం. రూ.రోజుకు రూ. 2వేల వరకు వ్యాపారం జరుగుతుంది. రెండు ఎకరాలకు గానూ రూ.3 లక్షల ఆదాయం వచ్చే అవకాశం ఉంది.

– నరసమ్మ, మాధవరం

మాధవరం రైతుల నుంచి చెరకు కొంటున్నా



కోసిగి కేంద్రంలో సొంతంగా మిషన్ ఏర్పాటు చేసుకుని చెరకు రసం విక్రయిస్తున్నాం. మాధవరం రైతుల నుంచి చెరకు గెడ రూ.10 చొప్పున కొనుగోలు చేస్తున్నాం. మా ఊరిలోనూ అదే ఊరి వాళ్లు మిషన్లు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఈ రకం చెరకులో ఎక్కువగా రసం ఉంటుంది.

– సాధిక్, కోసిగి

నిధుల మంజూరు

కౌతాళం: గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వ్యక్తమైన సమస్యల పరిష్కారానికి సంబంధించి మండలానికి వివిధ అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యాయని పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ చిరుతపల్లిలో డ్రైనేజి కల్వర్టు నిర్మాణానికి రూ.15లక్షలు, మల్లనహాట్టికి రూ. 5లక్షలు విడుదలయ్యాయని, గ్రామంలో డ్రైనేజి నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. త్వరలో ఈ పనులను ప్రారంభిస్తామని తెలిపారు. ఇప్పటికే పొదలకుంట, మదిర, తోవి, బంటకుంట, సుళేకేరి గ్రామాల్లో పనులు పూర్తి చేసినట్లు వివరించారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన

మంత్రాలయం రూరల్: మండల కేంద్రంలోని రాఘవేంద్ర డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సీఐ శ్రీనివాసులు చట్టాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ర్యాగింగ్‌కు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మహిళల రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన దిశ చట్టం గురించి క్లుప్తంగా వివరించారు. ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు.

పాఠశాలలో సైన్స్ అండ్ ఆర్ట్ క్రాఫ్ట్ ఎగ్జిబిషన్

ఆదోని అర్బన్ : పట్టణంలోని చిన్మయ విద్యాలయంలో సైన్స్ అండ్ ఆర్ట్ క్రాఫ్ట్ ఎగ్జిబిషన్‌ను బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా నెహ్రూ మెమోరియల్ పాఠశాల హెచ్ఎం అలీంసిద్దికీ హాజరయ్యారు. ముందుగా సివీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నేటి విద్యార్థుల తెలివితేటలు రాబోయే తరాలకు మంచి వెలుగును చూపుతాయన్నారు. అనంతరం విద్యార్థుల ప్రదర్శనలను తిలకించారు. స్కూల్ కరస్పాండెంట్ అండ్ సెక్రటరీ బి.దైవాదీనంరెడ్డి పాల్గొన్నారు.

కనుల పండువగా రథోత్సవం



భక్తుల మధ్య సాగుతున్న మహా రథోత్సవం(ఇన్‌సెట్) ప్రత్యేక అలంకరణలో గురుసుబ్బారూఢ స్వామి

కోసిగి: స్థానిక రంగప్ప గట్టు వద్ద వెలసిన గురు సుబ్బారూఢ స్వామి మహా రథోత్సవం బుధవారం సాయంత్రం రమణీయంగా సాగింది. వేకువజాము నుంచి ఆలయ ధర్మకర్తలు చంద్రయ్య, బండారి దయా, మణికంఠ స్వామి ఆధ్వర్యంలో స్వామి వారికి అభిషేకాలు, ఆకుపూజ, రుద్రాభిషేకం, వెండికవచ అలంకరణ గావించి మహా మంగళ హారతులు ఇచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం స్వామి వారి మూలవిరాట్‌ను ప్రభపై ఆశీనులు గావించి స్వామి వారి పాదాల వరకు లాగి తిరిగి యథాస్థానంలో చేర్చారు. సాయంత్రం స్వామి వారి ఉత్సవమూర్తిని పల్లకీలో కొలువుంచి మేళతాళాలు, కలశాలతో ఆలయం నుంచి పెండేకల్లు పొలాల్లోనున్న ఆంజనేయ స్వామి దేవాలయం వరకు ఊరేగింపుగా వెళ్లి తిరిగి ఆలయం చెంతకు చేరుకున్నారు. అనంతరం పూర్ణకుంభంతో మహా రథం వద్దకు చేరుకుని పూజలు చేసి అశేష భక్త జనం జయజయ ధ్వానాల మధ్య స్వామి వారి పాదాల చెంత వరకు రథాన్ని లాగి పూర్వస్థానంలో చేర్చారు. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎస్ఐ ధాజారెడ్డి, పోలీస్ సిబ్బంది బందోబస్తు కల్పించారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. రాత్రి భజనలు జరిగాయి.

గ్రామాల్లో ఐక్యతగా మెలగాలి



నెట్టేకల్‌వాసులతో ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని టౌన్: గ్రామాల్లో ఐక్యతాభావంతో మెలగాలని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తెలిపారు. పండగంటే అన్ని వర్గాలు, కుల,మతాలకు అతీతంగా జరుపుకోవాలని, తాగి గొడవలు సృష్టించుకోరాదన్నారు. బుధవారం మండలంలోని నెట్టేకల్ గ్రామానికి చెందిన ఇరువర్గాల మధ్య తలెత్తిన ఘర్షణపై ఎమ్మెల్యే స్వగృహంలో శాంతి చర్చలు జరిపారు. గతేడాది మొహర్రం సందర్భంగా ఇరువర్గాలు గొడవపడి ఒకరిపై ఒకరు కేసులు నమోదు చేసుకున్నారు. ఈ విషయంపై రెండువర్గాలు ఎమ్మెల్యేను ఆశ్రయించాయి. గ్రామంలో ప్రశాంతంగా జీవించాలని, గొడవలు, కేసులతో జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. రాజీకి రావాలని నిర్ణయించుకున్నట్లు ఇరువర్గాలు పేర్కొన్నాయి. దీంతో ఎమ్మెల్యే ఇరువర్గాలతో పాటు పోలీసులతో మాట్లాడి రాజీ చేయాలని సూచించారు. ఇందుకు పోలీసులు సానుకూలత వ్యక్తం చేశారు. అనంతరం ఇరువర్గాలు కలిసి ఎమ్మెల్యేను సన్మానించారు. ఆయన మాట్లాడుతూ పండగలంటే భక్తిశ్రద్ధలతో సంతోషంగా జరుపుకోవాలే తప్పా కులమతాల పేరుతో గొడవలకు పాల్పడొద్దని, పచ్చని పల్లెల్లో ఘర్షణలకు తావివ్వరాదని, ఇక నుంచి ఐక్యంగా మెలాగాలని సూచించారు. అభివృద్ధిలో ఆదర్శంగా నిలవాలని కోరారు. ఏదేని సమస్య ఉన్నా తన దృష్టికి తేవాలని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ గౌరవాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి





సమావేశానికి హాజరైన ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు, మాట్లాడుతున్న ఎంపీడీఓ గీతావాణి

ఆదోని రూరల్ : గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని ఎంపీపీ దానమ్మ సూచించారు. బుధవారం మండల సర్వసభ్య సమావేశాన్ని పట్టణంలోని మండల పరిషత్ సమావేశ భవనంలో నిర్వహించారు.. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు అజెండాలో పేర్కొన్న విషయాలపై చర్చ జరగకుండా సాధారణంగా నిర్వహించారు. సమస్యలు ఏవైనా ఉంటే తెలపాలని ఎంపీడీఓ సభ్యులను కోరారు. ఈ సందర్భంగా కొందరు సభ్యులు ఆయా గ్రామాల్లో ఉన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. వాటి పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని ఎంపీడీఓ ఆదేశించారు. ఈఓపీఆర్డీ జనార్దన్, పంచాయతీరాజ్ ఏఈ మాలిక్‌బాషా, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరుపుకుందాం



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్



అధికారులకు సూచనలిస్తున్న సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

కౌతాళం: ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రశాంతంగా జరుపుకుందామని ఆదోని సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్ అన్నారు. ఈనెల 13న జరుగనున్న పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో బుధవారం పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. తహసీల్దారు రామేశ్వర్‌రెడ్డి పోలింగ్ కేంద్రాల వసతుల తీరును సబ్‌కలెక్టర్‌కు వివరించారు. పోలింగ్ కేంద్రాల్లో వసతులపై తహసీల్దార్‌కు పలు సూచనలు చేశారు.పట్టభద్రులు, ఉపాధ్యాయులకు పోలింగ్ కేంద్రాలు వేర్వేరుగా ఉంటాయని వాటిల్లో తాగునీరు, విద్యుత్ వసతి ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు.అనంతరం గత ఏడాది పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఈ పాఠశాలలో ఉత్తీర్ణత శాతం ఎంత అని అక్కడే ఉన్న ఎంపీడీఓ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రశ్నించారు. ఆయన స్పందిస్తూ.. వందశాతం సాధించారని చెప్పగా.. ఈ ఏడాది కూడా వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

పోలింగ్ బూత్ పరిశీలన

కోసిగి: మండల కేంద్రంలోని పోలింగ్ బూత్‌లను ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ పరిశీలించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ రుద్రగౌడతో కలిసి పర్యటించారు. త్వరలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలకు అన్ని సౌకర్యాలు ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. అలాగే మండలంలోని జుమ్మాలదిన్నె సచివాలయాన్ని తనిఖీ చేశారు. అక్కడ పనిచేసే వెల్ఫేర్ అసిస్టెంట్ విధుల సక్రమంగా రావడం లేదని ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. విచారణ చేసి సచివాలయ ఉద్యోగస్తులు సకాలంలో విధులకు హాజరు కావాలని ఆదేశించారు. ఆర్ఐలు తిక్కస్వామి, శ్రీరాములు, వీఆర్వోలు ఉన్నారు.

ప్రైవేటు కుళాయి కనెక్షన్ల నిలుపుదల

హొళగుంద: వేసవి కాలం దృష్ట్యా ఇళ్లకు మంచి నీటి కొళాయి కనెక్షన్లు నిలుపుదల చేసినట్లు పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్ అన్నారు. బుధవారం ఆయన హొళగుందలో విలేకరులతో మాట్లాడుతూ.. వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఏప్రిల్‌లో తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ)లో నీటి సరఫరా నిలిచిపోతుందని, ఎస్ఎస్ ట్యాంకులో నిల్వ ఉన్న నీటితో గ్రామానికి సరి చేస్తామన్నారు. గ్రామానికి సరిపడా ఓవర్‌హెడ్ ట్యాంకులు లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. ఆయా కాలనీలకు వంతుల వారీగా ఐదు రోజులకోసారి నీటిని సరఫరా చేస్తామని ప్రజలు సహకరించాలని కోరారు. జూలై వరకు ప్రైవేటు కుళాయి కనెక్షన్లు ఇవ్వబోమన్నారు. సర్పంచ్ చలవాది రంగమ్మ సహకారంతో గ్రామస్తులకు తాగునీటి సరఫరలో ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని కోరారు.

ఎల్లెల్సీ పరిసరాలను కలుషితం చేస్తే చర్యలు

తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ) పరిసరాలను, నీటిని కలుషితం చేస్తే చర్యలు తీసుకుంటామని పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్ హెచ్చరించారు. బళ్లారి రోడ్డులోని కాలువ గట్టుపై కొందరు చికెన్ షాపుల నిర్వాహకులు వ్యర్థాలను వేయడం వల్ల దుర్వాసన వెదజల్లుతోందన్నారు. అంతేగాక నీరు కలుషితమై ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారన్నారు. కోళ్ల వ్యర్థాలను చెత్త సేకరణ కేంద్రంలో వేయాలని సూచించారు. బుధవారం ఆ ప్రాంతంలో కోళ్ల వ్యర్థాలను తొలగించి ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేయించారు.



పూజలందుకుంటున్న దేవమ్మ దేవి,పూర్ణకుంభాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

ఘనంగా ఊరి దేవర

కోసిగి: మండలంలోని జుమ్మాలదిన్నె గ్రామంలో 40 ఏళ్ల తర్వాత గ్రామ దేవతల ఊరు దేవరను ఘనంగా జరుపుకున్నారు. గ్రామంలో వెలసిన దేవమ్మ, సుంకులమ్మ, లక్ష్మమ్మ, రామక్కమ్మ, మైసమ్మ దేవతలకు గ్రామస్తుల సహకారంతో నూతన ఆలయాలు నిర్మించారు. గ్రామస్తులంతా ఐక్యంగా దేవర జరుపుకున్నారు. మంగళవారం రాత్రి నుంచి ఉత్సవాలు ప్రారంభం కాగా.. బుధవారం వేకువజామున మొక్కు చెల్లింపులో భాగంగా ప్రతి ఇంటి నుంచి నైవేద్యంతో పూర్ణకుంభాలను మేళతాళాలు డప్పు వాయిద్యాలు, కలశాలతో ఊరేగింపుగా ఆలయాలకు వెళ్లి అమ్మవార్లకు సమర్పించారు. దేవర సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇల్లు బంధు మిత్రులు, ఆడపడుచులతో కళకళలాడింది. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ ఎరిసా వలి, ఎస్ఐ రాజారెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

వైభవంగా మారెమ్మ దేవర

మంత్రాలయం రూరల్: మండలంలోని వగరూరు గ్రామంలో మారెమ్మ దేవరను బుధవారం వైభవంగా నిర్వహించారు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత అమ్మవారికి బలి సమర్పించారు. తెల్లవారుజామున గ్రామస్తులు ఇళ్లలో వండిన వంటలను ప్రత్యేక కుంభాల్లో ఉంచుకుని ఉరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ వేణుగోపాల్‌రాజు ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు.



పెద్దహరివాణంలో కుంభాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న దృశ్యం

వేడుకగా దేవర

ఆదోని రూరల్ : మండలంలోని పెద్దహరివాణం, బసాపురం గ్రామాల్లో బుధవారం దేవమ్మ, మారెమ్మ, సుంకలమ్మ దేవరను వేడుకగా నిర్వహించారు. గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలిరావడంతో గ్రామాలు కిటకిటలాడాయి.

కమనీయం.. మంగమాంబ రథోత్సవం



కరిడిగుడ్డంలో భక్తజనం మధ్య రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఆలూరు రూరల్: మండలంలోని కరిడిగుడ్డం గ్రామంలో కొలువైన అవధూత మంగమాంగ రథోత్సవం బుధవారం సాయంత్రం కమనీయంగా సాగింది. మంగమాంబకు ఆలయ అర్చకులు శ్రీనివాసులు విశేష పూజలు నిర్వహించారు. భక్తులు భరీ ఎత్తున తరలివచ్చి అమ్మవారికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం 6.45 నిమిషాలకు అశేష భక్తజనుల నడుమ ఎదురు బసవన్న గుడి వరకు రథాన్ని లాగారు.

కమ్మరచేడులో మంగమ్మవ్వ రథోత్సవం

ఆలూరు: కమ్మరచేడు గ్రామంలో కొలువైన మంగమ్మ అవ్వ రథోత్సవం బుధవారం కనులపండువగా సాగింది. చుట్టుపక్కల గ్రామాల భక్తులతో పాటు ఆదోని, ఆలూరు మండలాల నుంచి భక్తులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

శ్రీ మహాయోగి లక్ష్మమ్మ కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ నం.: 72

(APMACS చట్టం, 1995 క్రింద నమోదు కాబడినది) RBI లైసెన్స్ నం.: UBD, AP, 1671P
XIII/172, 173, ఫ్లవర్ బజార్, ఆదోని-518301, కర్నూలు జిల్లా, ఆం.ప్ర.

స్వాధీనతా ప్రకటన (లాంఛనప్రాయం మాత్రమే) రూల్ 8(1)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 9తో చదువబడే సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ, **శ్రీ మహాయోగి లక్ష్మమ్మ కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్, ఆదోని** యొక్క అధీకృత అధికారియగు దిగువ సంతకందారు **Ref No.SMLC.BANK; ADN; 2022-23 తేది: 28.11.2022** క్రింద డిమాండ్ నోటీసు జారీ చేసి, **రుణగ్రహీత: 1) జి. ఫయాజ్ బాషా తండ్రి జి. షేక్‌షావలీ, 2) జి. మహబూబ్ బాషా తండ్రి జి. షేక్‌షావలీ,** ఇ.నం.26/293, కౌడల్‌పేట్, ఆదోని, **A/C. No.: MTL - 200230141000566** వారిని సదరు నోటీసు అందిన తేదీ నుండి 60 రోజుల్లోగా నోటీసులో తెలిపిన మొత్తం **19.11.2022** వరకు **రూ.13,88,853/-** (పదమూడు లక్షల ఎనభై ఎనిమిది వేల ఎనిమిది వందల యాభై మూడు రూపాయలు మాత్రమే) (20.11.2022 నుండి చార్జీ చేయబడు/ చెల్లించదగు వడ్డీ మరియు ఇతర చార్జీలు తిరిగి చెల్లించవలసిందిగా కోరారు). **24.02.2023** నాటికి **రూ.14,06,449.00/-** (పద్నాలుగు లక్షల ఆరు వేల నాలుగు వందల నలభై తొమ్మిది రూపాయలు మాత్రమే) డెబిట్ బ్యాలెన్స్‌గా ఉంది.

రుణగ్రహీత సదరు మొత్తం తిరిగి చెల్లించుటలో విఫలమైనందున, సదరు రూల్స్‌తో చదువబడే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అతనికి సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ దిగువ వివరించిన ఆస్తిని దిగువ సంతకందారు **27 ఫిబ్రవరి, 2023**న వాస్తవ స్వాధీనత లేకుండా నామమాత్ర లాంఛనప్రాయంగా చేపట్టారని రుణగ్రహీతకు, గ్యారంటార్‌లకు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయటమైనది.

సదరు ఆస్తితో ఎలాంటి వ్యవహారములు జరుపరాదని మరియు సదరు ఆస్తితో జరిపే ఎలాంటి వ్యవహారములైనా **రూ.14,06,449.00/-** (పద్నాలుగు లక్షల ఆరు వేల నాలుగు వందల నలభై తొమ్మిది రూపాయలు మాత్రమే) (28.02.2023 నుండి చార్జీ చేయబడు/ చెల్లించదగు వడ్డీ మరియు ఇతర చార్జీలు) మొత్తం కొరకు **శ్రీ మహాయోగి లక్ష్మమ్మ కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్, ఆదోని** వారి చార్జికి లోబడి ఉంటాయని ముఖ్యంగా రుణగ్రహీతను మరియు గ్యారంటార్‌ను మరియు సాధారణ ప్రజలను ఇందుమూలంగా హెచ్చరించడమైనది.

షెడ్యూల్-సి

ఆస్తి వివరణ; (డాక్యుమెంట్ నం.3350 ఆఫ్ 2006)

ఆదోని సబ్ రిజిస్ట్రేషన్ జిల్లా మరియు కర్నూలు రిజిస్ట్రేషన్ జిల్లా పరిధిలో ఆదోని మున్సిపాలిటీ పరిధిలో కౌడల్ పేట్ వద్దగల వార్డు నం.26 లోని డోర్ నం.87/8 కలిగి ఉన్న గ్రౌండ్‌ఫ్లోర్ మరియు మొదటి అంతస్తు గల ఇల్లు మరియు సరిహద్దులు దిగువ విధంగా ఉన్నాయి. **సరిహద్దులు: తూర్పు:** రోడ్డు, **పశ్చిమం:** షానవాజ్, అయూబ్‌కు చెందిన నం.XXVI-36 కలిగి ఉన్న ఇల్లు, **ఉత్తరం:** వంక, **దక్షిణం:** జి. ఫాతిమా బీ యొక్క ఓపెన్ సైట్. **సైట్ కొలతలు:** తూర్పు- పశ్చిమం: 35 అడుగులు లేదా 10.66 మీటర్లు, ఉత్తరం- దక్షిణం: 18 అడుగులు 5.48 మీటర్లు. **సైట్ మొత్తం విస్తీర్ణం: 70 చదరపు గజాలు.**

తేది:27.02.2023, ప్రదేశం: ఆదోని — సం/- అధీకృత అధికారి